సర్దాపూర్‌లో గాలిదుమారానికి లేచిపోయిన ఇంటి పైకప్పు

సిరిసిల్ల టౌన్: కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఇంటిపై తెగిపడిన విద్యుత్ తీగలు

కోనరావుపేట: నిమ్మపల్లిలో ఈదురుగాలులకు ధ్వంసమైన ఇంటి పైకప్పు

ఈదరుగాలుల బీభత్సం

- ఉరుములు, మెరుపులతో జిల్లాలో వర్షం
- నేలకొరిగిన భారీ వృక్షాలు
- ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు
- లేచిపోయిన ఇంటి పైకప్పులు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యం

జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం గాలివానం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో గంటపాటు అతివేగంతో వీచిన గాలి జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఓవైపు గాలిదుమారం, మరో వైపు వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసిముద్దయ్యింది. గాలి దుమారానికి ఇంటి పైకప్పులు లేచిపోగా, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. విద్యుత్ తీగలు తెగి కిందపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి చాలా గ్రామాల్లో అంధకారం నెలకొన్నది.

– రాజన్న సిరిసిల్ల, మే 25 (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల టౌన్/ చందుర్తి/ ఎల్లారెడ్డిపేట/ కోనరావుపేట/ ముస్తాబాద్

చందుర్తి: మూడపల్లిలో విద్యుత్ తీగలపై విరిగిపడ్డ వేప చెట్టు

కోనరావుపేట: ధర్మారంలో ఇంటిపై కూలిన వృక్షాన్ని చూపుతున్న ముడికే రాములు

జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచాయి. సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్, బీవైనగర్‌లో చెట్టు విరిగి ఇండ్లు, వాహనాలపై పడ్డాయి. భారీ వృక్షాలు కరెంట్ తీగలపై పడడంతో చాలా సమయం వరకు పట్టణం అంధకారంలో ఉండిపోయింది. సిరిసిల్ల పట్టణం తోపాటు అన్ని మండలాల్లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి ఆధ్వర్యంలో డైరెక్టర్లు, సిబ్బంది పర్యటించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. సిరిసిల్ల అర్బన్ మండలం సర్దాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయం వద్ద భారీ మర్రిచెట్టు వేళ్లతో సహా నేలకూలింది. ప్రతి మండలంలో పది నుంచి పదిహేను వరకు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో యుద్ధ ప్రతిపాదిక చర్యలు చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపం వద్ద రోడ్డుపై వేపచెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. పట్టణంలో చాలా చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్థంబాలపై పడ్డాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి స్వయంగా పర్యవేక్షించి చెట్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. అర్ధరాత్రి చీకట్లోనూ సెస్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. గాలిదుమారంతో విరిగిన విద్యుత్ స్తంభాలు, కూలిన ట్రాన్స్‌ఫార్మర్లతో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థకు రూ.50లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు.

- చందుర్తి మండలంలో ఈదురు గాలులు, మెరుపులు, ఉరుములతో సుమారు రెండు గంటల పాటు వడగండ్ల వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ తీగలు చెట్లపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- ముస్తాబాద్ మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బంధనకల్‌లో కరుణాకర్‌రెడ్డి, ముస్తాబాద్‌లో కృష్ణకు చెందిన కార్లపై చెట్లకొమ్ములు పడడంతో ధ్వంసమయ్యాయి. గూడెంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టుపడి, పాక్షికంగా ధ్వంసమైంది.
- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్‌పై ఉన్న ప్లెక్సీ గాలికి తెగి పడడంతో నిర్వాహకుడు జావీద్ తలకు గాయాలయ్యాయి. వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అక్కపల్లిలో పలు ఇండ్లపై కప్పులు, రేకులు ఎగిరిపోయాయి.
- కోనరావుపేట మండలం ధర్మారంలో ఇంటిపై భారీ వృక్షం పడిపోవడంతో ముడికే రాములు ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే కొండాపూర్‌లో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. మండల వ్యాప్తంగా నాలుగు గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తడిసిపోయింది. దూదెకుల మహమ్మద్ కోళ్ల ఫారంపై ఉన్న రేకులు కొట్టుకుపోయాయి. విద్యుత్ తీగలపై భారీ వృక్షాల కొమ్మలు విరిగిపడ్డాయి. బావుసాయిపేటలో పోకల అశోక్ ఇల్లు పైకప్పు, నిమ్మపల్లిలో పలువురి ఇండ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి.

కోనరావుపేట: గాయపడిన వారికి సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స చేయిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

కోనరావుపే మండలం నిజామాబాద్ గ్రామశివారులో శ్రీ లక్ష్మీనరసింహా వైన్స్ వద్ద సిరికొండ మండలం గడ్కోల గ్రామానికి చెందిన కస్తూరి సుమన్, శ్రీనివాస్ గాయపడ్డారు. ఇద్దరు తమ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వెళ్లివస్తున్న క్రమంలో గాలివాన రావడంతో వైన్స్ ముందు ఉన్న రేకుల కింద ఆగారు. ఈ క్రమంలో గాలికి ఒక్కసారిగా రేకులు విరిగిపడడంతో సుమన్, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆంజనేయులు హుటాహుటిన అక్కడికి చేరుకుని వారిని పోలీస్ వాహనంలో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. సుమన్ పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వారిని దవాఖానకు తీసుకెళ్లి మానవత్వం చాటుకున్న ఎస్ఐకి పలువురు అభినందనలు చెప్పారు.

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌లో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్లు

చందుర్తి: లింగంపేటలో రహదారిపై విరిగిపడ్డ చెట్టు

కోనరావుపేట: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

నిజామాబాద్ గ్రామంలో నేలవాలిన భారీ వృక్షం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత

రమ్యకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, మే 25: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. రాగట్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మందాటి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును అతడి భార్య రమ్యకు శనివారం తెలంగాణ భవన్‌లో రామన్న అందించారు. కార్యకర్తల కుటుంబాలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లంకెబిందెలు వెలికితీస్తామని నమ్మించి..

- అమాయక మహిళ నుంచి ₹30లక్షలు హాంఫట్
- ముగ్గురు కేటుగాళ్ల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ వీరప్రసాద్

వివరాలు వెల్లడిస్తున్న వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్

వేములవాడ, మే 25: గప్తనిధులు.. లంకెబిందెలు వెలికితీస్తామని ఓ అమాయక మహిళను నమ్మించి ₹30లక్షలు కాజేసిన కేటుగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్ట ణ పరిధిలోని హనుమక్కపల్లికి చెందిన సింగారపు అంజవ్వ ఏడాదిన్నరగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ విషయాన్ని తన సమీ ప బంధువు ఎల్లయ్యకు చెప్పింది. దీంతో ఆయన వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరిలో మహిపాల్ అనే పూజారి ఉన్నాడని, అతడి దగ్గరికెళ్లి నాటు వైద్యం చేయించుకుంటే రోగం నయమవుతుందని అంజవ్వను నమ్మించి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వైద్యం కోసం నిత్యం మహిపాల్ దగ్గరకి వెళ్లొస్తున్న అంజవ్వ తనకున్న అన్ని సమస్యలతోపాటు వ్యక్తిగత విషయాలను సైతం పంచుకున్నది. ఇదే అదనుగా భావించిన మహిపాల్ అంజవ్వ జాతకం చూసి తన తల్లిగారి ఇల్లైన కోనాయపల్లిలో లంకెబిందెలు ఉన్నాయని, వాటిని తవ్వితిస్తే పెద్దఎత్తున బంగారం లభిస్తుందని చెప్పాడు. వాటిని తవ్వి తీసేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని నమ్మించాడు. ఇది నిజమని నమ్మిన అంజవ్వ విడుతల వారీగా మహిపాల్‌కు సుమారు ₹20లక్షల వరకు ఇచ్చింది. ఇదే సమయంలో మహిపాల్, అంజవ్వ వ్యవహారశైలిని గమనించిన సుద్దాలకు చెందిన అబ్రహం, కొంతకాలం తర్వాత వీరిద్దరిని సంప్రదించాడు. లంకెబిందెల్లో నుం చి తీసిన బంగారం కడిగేందుకు తాను సహకరిస్తానని చెప్పి వారితో జతకట్టాడు. అబ్రహం మాటలు నమ్మిన అంజవ్వ ₹10లక్షల వరకు అప్పజెప్పింది. ఇలా మొత్తం ₹30లక్షలు ఇద్దరికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా మహిపాల్, అబ్రహం చెప్పినవిధంగా జరగకపోవడంతో తాను మోసపోయానని అంజవ్వ గ్రహించింది. ఈ క్రమంలో వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మహిపాల్, అబ్రహం, ఎల్లయ్యను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని ఈ మధ్య కాలంలో కొందరు బాబాలు, పూజారులుగా మారి జ్యోతిష్యం చెబుతామంటూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని, వారిని నమ్మవద్దని సీఐ వీరప్రసాద్ సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ఈదురుగాలుల బీభత్సవానికి మృతి చెందిన కోళ్లు

పౌల్ట్రీ షెడ్డు ధ్వంసం

- 200కి పైగా కోళ్లు మృతి.. రూ.4లక్షలకు పైగా నష్టం
- దిక్కుతోచని స్థితిలో గిరిజన రైతు

ఎల్లారెడ్డిపేట, మే 25: 18 ఏండ్లపాటు ఎడారి దేశంలో చెమటోడ్చిన సొమ్ము, సహకార సంఘం రుణపు ఆస్తితో ఇక భవిష్యత్ బాగుండాలని పౌల్ట్రీ ఫాం పెట్టుకుని జీవితంలో స్థిరపడుతున్నానని అనుకుంటున్న తరుణంలో ఒక్క ఈదురుగాలి ఓ గిరిజన రైతు ఆశలను తుడిచి పెట్టిన మానవీయ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం కిష్టూనాయక్‌తండాలో శనివారం చోటుచేసుకున్నది. కిష్టూనాయక్ తండాకు చెందిన మాలోత్ హన్మంత్‌నాయక్ తండాలో ఎన్నో కష్టాలనుభవించి బతుకుదెరువు కోసం 18 ఏండ్లు దుబాయ్‌లో కూలీగా పనిచేశాడు. కరోనా సమయంలో ఆరోగ్యం బాగలేక ఇక ఇంటి వద్దే తాను సంపాదించిన సొమ్ముతో ఏదో పనిచేసుకుని బతుకుదామని వచ్చాడు. తనకున్న 20గుంటల భూమిలో పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేసుకుని (6 వేల సామర్థ్యం) జీవిద్దామని సహకార బ్యాంకులో రూ.15లక్షలు రుణంతో పాటు తాను కష్టపడి సంపాదించిన సొమ్ముతో షెడ్డు వేసుకున్నాడు. శనివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు షెడ్డుపై ఉన్న సుమారు వంద రేకులు ఎగిరి ముక్కలుముక్కలుగా విరిగిపోయాయి. కొన్ని రేకులు కోళ్లపై పడటంతో సుమారు 2 వందల కోళ్లు మృతి చెందగా, రూ.4లక్షల వరకు నష్టం వచ్చినట్లు బాధిత హన్మంతునాయక్–నిర్మల దంపతులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రంగి, మే 25: మండల కేంద్రంలో రోడ్ వైనింగ్ మెయింటెనెన్స్ కారణంగా ఆదివారం రుద్రంగిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చందర్తి సెస్ ఏఈ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్ వైనింగ్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని మహేశ్ సూచించారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

ఇల్లంతకుంట, మే 25: అడవిపంది దాడిలో రైతు గాయపడిన ఘటన పెద్దలింగాపూర్ శివారులో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్ముల మోహన్ తన వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తుండగా, శుక్రవారం సాయంత్రం అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వేములవాడ రూరల్: మాట్లాడుతున్న పట్టణ సీఐ వీరప్రసాద్

వేములవాడ రూరల్, మే 25: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ, రూరల్ సీఐలు వీరప్రసాద్, సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ ఏడీఏ కార్యాలయంలో ఫర్టిలైజర్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ, డీలర్లు నకిలీ, లూజ్ విత్తనాలు, విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అధిక ధరకు విత్తనాలు విక్రయించవద్దని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాల రసీదును రైతులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ఇక్కడ ఏవో సాయి కృష్ణ, ఎస్ఐ మారుతి, డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు తూం కాంతారావు, ఫర్టిలైజర్ డీలర్లు, తదితరులు ఉన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

చందుర్తి, మే 25: కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మండల రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వానాకాలం సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆమోదం ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇక్కడ ఏవో దుర్గరాజు, చందుర్తి రుద్రంగి మండలాల ఏఈవోలు, విత్తన డీలర్లు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

ఇల్లంతకుంట, మే 25: అన్నదాతలకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని ఎస్ఐ రాజుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో అన్ని గ్రామాలకు చెందిన ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణాదారులతో ఎస్ఐ సమావేశమయ్యారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ ఏఈవోలు, ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు, తదితరులు ఉన్నారు. అలాగే గుడెప్పల్లి గ్రామంలో రైతులకు నాణ్యమైన విత్తనాల సాగుపై ఏఈవో అర్చన అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

వరి ధాన్యం చోరీకి యత్నం

చందుర్తి, మే 25: మల్యాలలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీకి యత్నించిన ఓ మహిళను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మోతుకుపల్లి రాజవ్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించింది. ధాన్యం విక్రయించడం ఆలస్యం కావడంతో వడ్లపై టర్పాలిన్ కప్పింది. ఈ క్రమంలో సనుగుల గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు ధాన్యాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నించగా, వెంటనే అక్కడికి చేరుకున్నారు. చోరీకి యత్నించిన ఐదుగురు పరారు కాగా, ఓ మహిళను పట్టుకొని దేహశుద్ధి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

సీఎంను కలిసిన విప్

సీఎం రేవంత్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 25: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారం పాటు దుబాయ్ వెళ్లిన విప్, నేరుగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఈజీఎస్ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేత

కోనరావుపేట, మే 25: వట్టిమల్లలో ఉపాధిహామీ కూలీలకు గ్రామానికి చెందిన దాదె జలపతి సొంత ఖర్చులతో శనివారం మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. 300మందికి పైగా ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ జీపీ సెక్రటరీ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, గ్రామస్తులు ఉన్నారు.


రుద్రంగిలో దుకాణాదారులతో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

పంచాయతీ వనరులు వినియోగించుకోవాలి

రుద్రంగి, మే 24: పంచాయతీ వనరులను గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. మండల కేంద్రంలోని నర్సరీ, డంప్‌యార్డు, శ్మశానవాటిక, కంపోస్టుషెడ్, పల్లె పకృతివనం, క్రీడా ప్రాంగణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. నర్సరీ, పల్లె పకృతి వనంలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. ఇక్కడ ఎంపీవో సుధాకర్, కార్యదర్శి రాందాస్, తదితరులు ఉన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ రుసుం తగ్గించాలని మండల కేంద్రంలోని దుకాణాదారులు శనివారం డీపీవో వీర బుచ్చయ్యకు వినితి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా డీపీవో వారితో సమావేశమయ్యారు. ఇక్కడ ఎంపీవో సుధాకర్, కార్యదర్శి రాందాస్, దుకాణాదారులు ఉన్నారు.

ప్రగతి పనుల పరిశీలన

చందుర్తి, మే 25: మర్రిగడ్డలో పల్లె ప్రగతి పనులను జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య శనివారం పరిశీలించారు. వైకుంఠధామం,కంపోస్ట్ షెడ్, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని పర్యక్షేంచారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, కార్యదర్శి నరేశ్, సిబ్బంది ఉన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలుచేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, మే 25: రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ సంస్థల బలోపేతం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు మట్టె శ్రీనివాస్, ఎండీ రియాన్, కోడం నరేశ్, వెంకటేశ్, సామల శ్రీకాంత్, రాపెల్లి భాను, అరవింద్, తదితరులు ఉన్నారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, మే 25: పట్టణంలోని బాల్‌నగర్‌కు చెందిన తుమ్మ అనమ్మ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ తుమ్మ లూర్థురెడ్డిని పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట రాయపురెడ్డి, బాల స్వామిరెడ్డి, భరత్‌రెడ్డి, దేవరాజు, విజయ్, తదితరులు ఉన్నారు.

వృద్ధుడికి వీల్‌చైర్ అందజేత

రూప్‌సింగ్‌కు వీల్‌ఛైర్ అందిస్తున్న లక్ష్మీరాజం

కలెక్టరేట్, మే 25: అనారోగ్యంతో ఓ వృద్ధుడి కుడికాలు శస్త్ర చికిత్స చేసి తొలగించగా జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అతడికి వీల్‌చైర్ అందజేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు బానోత్ రూప్‌సింగ్‌కు వీల్‌ఛైర్ అందించారు. వీల్‌ఛైర్ అందించిన జిల్లా సంక్షేమ అధికారికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.